ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -102 గురువారం 30 జులై 2026

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

### పర్యావరణ అనుముతులు చెల్లుబాటు

### -సుప్రీంకోర్టులో ఉపశమనం



**న్యూఢిల్లీ,జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మిగతా 2లో.

## ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

### కుంకీ శిబిరాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

**పార్వతీపురం మన్యం జిల్లా గుచ్చిమిలో కుంకీ ఏనుగుల శిబిరం ప్రారంభం**



**అమరావతి జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
ఉత్తరాంధ్రలో ఏళ్ల తరబడి రైతులను, ప్రజలను భయపెడుతున్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ-అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. మిగతా 2లో.



## ఆర్ఎస్ఎస్ నియంత్రణలో విద్యావ్యవస్థ

**లోక్‌సభలో రాహుల్ ఫైర్: అమిత్ షా, ఆరెస్సెస్‌పై తీవ్ర ఆరోపణలు**

**లోక్‌సభలో అమిత్ షా, ఆర్ఎస్ఎస్‌ను టార్గెట్ చేసిన రాహుల్ గాంధీ**

**విద్యార్థులపై పోలీసుల చర్యకు హోంమంత్రి ఆదేశాలిచ్చారని వ్యాఖ్య**

**ఆధారాలు లేకుండా మాట్లాడొద్దని, క్షమాపణ చెప్పాలని కేంద్రం డిమాండ్**

**న్యూఢిల్లీ,జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభలో ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. మిగతా 2లో.

# సెప్టెంబర్ 15న 3,168 పోస్టులు

### జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు

**ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి: మంత్రి నారా లోకేశ్**

**3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన**

**ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం**

**మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం**

**అమరావతి జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 అమలుపై ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. మిగతా 2లో.



### పరీక్షల సవరణ బిల్లుకు

## లోక్‌సభలో ఆమోదం

**పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం**

**పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా**

**ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన**

**నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం**

**పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి**



**న్యూఢిల్లీ,జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, మిగతా 2లో.

## మైనారిటీ యువతకు స్వర్ణావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్**

**గుంటూరు, జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలోని మైనారిటీ యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకువచ్చి వారిని స్వయం సమృద్ధి వైపు నడిపించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ తెలిపారు. విద్య ద్వారానే మిగతా 2లో.



## తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా నియామకాలు

### మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల

**హైదరాబాద్,జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ౧÷ర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) మిగతా 2లో.




## పని మాది.. ప్రచారం బాబుది

**భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ తన ఖాతాలోకి వేసుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారన్న జగన్**

**విమానాశ్రయానికి సంబంధించిన అన్ని పనులు తమ హయాంలోనే జరిగాయని వ్యాఖ్య**

**2026 నాటికి విమాన రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామన్న జగన్**



**అమరావతి జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగ దారులు వెతుకుతున్నారని, కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో.

## ఏపీలో పెట్టుబడులకు తైవాన్ ఆసక్తి..



**చంద్రబాబు, లోకేశ్ తో దిగ్గజ కంపెనీల ప్రతినిధుల భేటీ**

**సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తో వేర్వేరుగా భేటీ అయిన తైవాన్ పారిశ్రామిక ప్రతినిధులు**

**ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా చర్చలు**

**రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి**

**ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై కీలక ఒప్పందాలు**

**తయారీ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి అంగీకారం**

**అమరావతి జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు తైవాన్ పారిశ్రామిక ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లతో వేర్వేరుగా సమావేశమైంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అధునాతన తయారీ రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. మిగతా 2లో.

## పరీక్షల సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది.ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

## పని మాది.. ప్రచారం బాబుది

**మొదటిపేజీ తరువాయి**

సోషల్ మీడియా వేదికగా జగన్ స్పందిస్తూ... "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతీదీ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి" అని స్పష్టం చేశారు.ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే... ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు.

## తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా నియామకాలు

**మొదటిపేజీ తరువాయి**

1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ రైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య, వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

**మొదటిపేజీ తరువాయి**

మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో విద్యావ్యవస్థ

**మొదటిపేజీ తరువాయి**

భారత విద్యావ్యవస్థ ఆర్‌ఎస్‌ఎస్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి కేవలం నామమాత్రంగానే ఉన్నారని, తెరవెనుక అసలు వ్యవస్థను నడిపిస్తోంది ఆర్‌ఎస్‌ఎస్సేనని ఆయన విమర్శించారు. "ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక ప్రతీక మాత్రమే. మన విద్యార్థులకు అసలైన శత్రువు ఆర్‌ఎస్‌ఎస్" అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు జ్ఞానం, సత్యాల దిశగా పయనించకుండా ఆర్‌ఎస్‌ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. నీట్ అవకతవకలకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జూలై 20న విద్యార్థులు చేపట్టిన నిరసనపై జరిగిన పోలీసుల చర్యకు అమిత్ షానే బాధ్యుడని ఆయన ఆరోపించారు. "మన విద్యార్థులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రే అనుమతి ఇచ్చారు. వారి శరీరాల్లోకి పెల్లెట్లు దిగేలా చేశారు" అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్లమెంటును ఎదుర్కొనే ధైర్యం హోంమంత్రికి లేదని ఆయన ఎద్దేవా చేశారు.రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం రాహుల్ సంయమనం పాటించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు కచ్చితమైన ఆధారాలు చూపాలని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. ఈ క్రమంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# సెప్టెంబర్ 15న 3,168 పోస్టులు

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు.

జాబ్ కేలండర్-2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగష్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది.

అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది.

### 3, 4 దశల నోటిఫికేషన్లు అక్టోబర్‌లో

జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్-1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్-2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

# ఏపీలో పెట్టుబడులకు తైవాన్ ఆసక్తి..

**మొదటిపేజీ తరువాయి**

డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ వంటి పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు అందుబాటులో ఉన్న సానుకూల వాతావరణాన్ని వారికి వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, విమానాశ్రయాలు, పటిష్టమైన రోడ్డు, రైలు మార్గాల ద్వారా బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రాష్ట్రం కలిగి ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పూర్తిస్థాయి ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు.భారత్‌లో తమ దేశ సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు విస్తరించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.

**మంత్రి లోకేశ్ తో నైపుణ్యాభివృద్ధిపై చర్చలు**

అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తో తైవాన్ ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా మానవ వనరుల అభివృద్ధి, ఏపీ యువతకు నైపుణ్యాల కల్పనపై చర్చించారు. తైవాన్ తయారీ, సాంకేతిక రంగాల్లోని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతకు అవసరమైన శిక్షణ, ఉన్నత విద్యా భాగస్వామ్యంపై లోకేశ్ వారితో విస్తృతంగా మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారానికి నిర్ణయించారు.ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడం, యువతకు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలపై కూడా చర్చలు జరిగాయి. ఏపీ, తైవాన్ మధ్య సంబంధాలలో ఈ సమావేశాలు ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. పారిశ్రామిక పెట్టుబడులతో పాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఆదోనిలో హెచ్‌ఆర్‌డీ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం

**హెలిప్యాడ్ వద్ద మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల ఆత్మీయ ఆహ్వానం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 29)**ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న మానవ వనరుల అభివృద్ధి (హెచ్‌ఆర్‌డీ), ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం లభించింది.మంత్రి నారా లోకేష్ రాక సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ జయనాగేశ్వర రెడ్డి కలిసి స్వాగతం పలికారు.అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి పి. శ్రీనివాస రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, బోయ కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, మాజీ ఎంపీ సంజీవ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ బాషా, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, జనసేన నాయకులు సురేష్, మల్లప్పతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని మంత్రికి ఆత్మీయ స్వాగతం తెలిపారు.మంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ప్రాంతంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొనగా, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరై మంత్రికి అభినందనలు తెలియజేశారు.



## ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

**మొదటిపేజీ తరువాయి**

ఈ శిబిరం ఏర్పాటు ఉత్తరాంధ్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన అభివర్ణించారు.

సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ప్రకృతి మనది కాదు, మనమే ప్రకృతిలో భాగం. కాబట్టి దానితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుంది" అని అన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో అడవుల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి రావడం, రైతుల పంటలను నాశనం చేయడం, రాత్రిపూట ప్రజలు భయంతో జీవించడం వంటి సమస్యలు చాలాకాలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతోనే 'గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియా'ను ఏర్పాటు చేశామని వివరించారు.

గతంలో చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో 'జయంత్', 'అభిమన్యు' అనే కుంకీ ఏనుగులు అటవీ శాఖ అధికారులతో కలిసి అద్భుతంగా పనిచేశాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో అక్కడ ఏనుగుల దాడుల్లో మరణాలను 70 శాతానికి పైగా తగ్గించామని, పంట నష్టాన్ని కూడా గణనీయంగా నివారించామని పేర్కొన్నారు. మన్యం జిల్లాలోనూ అలాంటి విజయాన్నే సాధించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ శిబిరం కోసం నాలుగు కుంకీ ఏనుగులను పంపిన కర్ణాటక ప్రభుత్వానికి, ప్రజలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "ఏనుగులను బహుమతిగా ఇవ్వడాన్ని అక్కడి ప్రజలు తమ సంపదను పంచుకోవడంతో సమానంగా భావిస్తారు. ఇది వారి ఉదారతకు, స్నేహానికి నిదర్శనం. తెలుగు ప్రజల భద్రతపై ప్రేమతో ఏనుగులను పంపినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన అన్నారు. మానవులు, ఏనుగులు సామరస్యంగా సహజీవనం చేసేందుకు ఈ శిబిరం వేదికగా నిలుస్తుందని ఆశిస్తూ, దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

## మైనారిటీ యువతకు స్వర్ణావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమనే సంకల్పంతో ప్రభుత్వం మైనారిటీల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.మంగళగిరి సమీపంలోని వడ్డేశ్వరం వద్ద రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ నూతన కార్యాలయాన్ని మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ మాట్లాడుతూ.. రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు, సూచనల మేరకు సీఈడీఎం ద్వారా మైనారిటీ యువత కోసం ఉచిత కోచింగ్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తూ ప్రత్యక్ష తరగతులకు హాజరు కాలేని విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన అధ్యాపకులతో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌తో పాటు ఆఫ్‌లైన్ తరగతులను కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఎక్కడ ఉన్నా నాణ్యమైన శిక్షణ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో మైనారిటీ యువత విద్యా, ఉద్యోగ శిక్షణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీల విద్యా సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు. పోటీ పరీక్షలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వం వంటి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీ జనాభా సుమారు 7.5 నుంచి 8 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఏకంగా 11.5 శాతం మంది మైనారిటీ అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించడం ప్రభుత్వ చర్యలకు నిదర్శనమని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు సాధించిన వారిలో దాదాపు 48 శాతం మంది మైనారిటీ మహిళలు ఉండటం మహిళా విద్య, సాధికారత దిశగా రాష్ట్రం సాధిస్తున్న పురోగతిని చాటుతోందన్నారు.ఉర్దూ ఉపాధ్యాయ అభ్యర్థుల కోసం వక్ఫ్ బోర్డు స్వంత నిధులతో దాదాపు 7,000 మందికి ప్రత్యేక శిక్షణ అందించామని, అనంతరం పారదర్శకంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 250 మంది టాపర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు ముందుకు రావాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. గ్రామీణ విద్యార్థులకు ముఖ్యంగా మైనార్టీ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఇది ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు నా వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే ఎండీ నజీర్, మైనార్టీ వ్యవహారాల సంక్షేమ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, సిఈడియం డైరెక్టర్ కె. యాకూబ్ బాషా తదితరులు మాట్లాడారు. సీఈడీఎం-ఏపీ మొబైల్ అప్లికేషన్ యాప్ ను మంత్రి ఎన్.ఎమ్.డీ ఫరూక్ , ఇతర కార్పొరేషన్ చైర్లన్లు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా మైనార్టీ విద్యార్థులు సీఈడీఎం ద్వారా పోటీ పరీక్షల పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఫారూక్ షుబ్లీ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, నూర్ బాషా/దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, రాష్ట్ర షేక్ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వై.ఎస్. ముక్తియార్, తదితరులు పాల్గొన్నారు

# గురు పౌర్ణిమ సందర్భంగా వృక్ష యజ్ఞం ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ.




**ఆళ్లగడ్డ జులై 29 రిపబ్లిక్ న్యూస్** ఆళ్లగడ్డ పట్టణంలోని ఎం.వి నగర్ లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణిమ పర్వదినం సందర్భంగా వృక్షయజ్ఞం సొసైటీ వ్యవస్థాపకురాలు లావణ్య ఆధ్వర్యంలో ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ వృక్షయజ్ఞం సొసైటీ చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. మొక్కలను విరివిగా నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు లావణ్య మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో మొక్కల పంపిణీ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈ రోజు గురు పౌర్ణిమ సందర్భంగా భక్తులకు తులసి, బిల్వం, ఉసిరి తదితర మొక్కలను అందజేయడం జరిగిందని తెలిపారు.మొక్కల దానం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని లావణ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శశికళ, శివలక్ష్మి, తేజ, స్వర్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

# పాటిల్ సురేష్ కు అండగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్



**హైదరాబాద్, జూలై 29:( రిపబ్లిక్ న్యూస్)**
అనంతపురం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ పాటిల్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర వైద్యం అందేలా స్వయంగా చొరవ తీసుకుని హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్ వైద్యులతో మాట్లాడించి చికిత్సకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయించారు.తన తల్లి పద్మజ సహకారంతో వైద్య బృందాన్ని సమన్వయం చేసిన వరుణ్ తేజ్, సురేష్ పాటిల్‌కు అత్యుత్తమ వైద్యం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆపరేషన్ విజయవంతంగా పూర్తయ్యే వరకు చికిత్సను పర్యవేక్షించడమే కాకుండా, ఆసుపత్రిలో ఆయనకు, కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిసింది.
అంతేకాకుండా చికిత్సకు అయ్యే పూర్తి వైద్య ఖర్చును కూడా వరుణ్ తేజ్ స్వయంగా భరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సురేష్ పాటిల్ పూర్తిగా కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ధైర్యం చెప్పారని పేర్కొన్నారు.అభిమానుల కష్టసుఖాల్లో అండగా నిలవడం వరుణ్ తేజ్‌కు కొత్త కాదని అభిమానులు గుర్తు చేస్తున్నారు. ఇటీవల అనంతపురం జిల్లాకు చెందిన ఓ అభిమాని మృతిచెందిన సందర్భంగా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తన సేవా భావాన్ని చాటుకున్న విషయం తెలిసిందే.మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ, అవసరంలో ఉన్న వారికి చేయూతనందించడంలో వరుణ్ తేజ్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారని అభిమానులు, జనసేన నాయకులు కొనియాడుతున్నారు. ఆయన చూపిన మానవత్వం, సేవా దృక్పథం అభిమానుల్లో మరింత గౌరవాన్ని పెంచిందని పేర్కొన్నారు

# మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

### ఆదోని పర్యటన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 29)**
మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ని కర్నూలు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు.
మంత్రి నారా లోకేష్ ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న సందర్భంగా, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ తరపున మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైఎస్సార్సీపీ ఎన్ఆర్ఐ సమావేశం సక్సెస్

**సంక్షేమ పథకాలపై ఎన్ఆర్ఐలకు వివరణ**
**ఓ ఆర్ ఎమ్ ప్రాధాన్యతపై దిశానిర్దేశం**
**గ్లోబల్ టీం వర్క్ తో పార్టీ బలోపేతం**



**అమెరికా/విజయవాడ ప్రతినిధి, జూలై 29, రిపబ్లిక్ స్పెషల్ డెస్క్**
అమెరికాలోని అట్లాంటా నగరంలో నిర్వహించిన వైఎస్సార్సీపీ ఎన్ఆర్ఐ అవుట్‌రీచ్ సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా 2019 నుంచి 2024 వరకు జగనన్న ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా సంస్కరణలు, ప్రజలకు అందించిన పారదర్శక పాలనపై సమావేశంలో సమగ్రంగా వివరించారు.
ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన నిజాయితీ, నిబద్ధతతో పాటు పేదలు, బలహీన వర్గాల సంక్షేమం పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రస్తావించారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాల లక్ష్యాలు, వాటి అవసరాన్ని ఎన్ఆర్ఐ కార్యకర్తలకు వివరించారు.
ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ రిప్యుటేషన్ మేనేజ్‌మెంట్ (ఓ ఆర్ ఎమ్) కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ, కేవలం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేయడం లేదా కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే కాకుండా ప్రతి ప్రయత్నం స్పష్టమైన లక్ష్యం, సమన్వయం, కొలవగల ఫలితాలతో సాగాలని సూచించారు. వాస్తవాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడం, తప్పుడు ప్రచారాలను ఆధారాలతో ఎదుర్కోవడం, జగనన్న పాలనలో అమలైన సంక్షేమ కార్యక్రమాలకు డిజిటల్ వేదికల్లో మరింత గుర్తింపు తీసుకురావడం, కొత్త వర్గాలను చేరుకోవడం, బలమైన కంటెంట్ ,సాంకేతిక బృందాలను నిర్మించడం, ప్రతి కార్యక్రమాన్ని నిరంతరం సమీక్షిస్తూ ఫలితాల ఆధారంగా ముందుకు సాగడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు.
అదేవిధంగా వైఎస్సార్సీపీ ఎన్ఆర్ఐ వింగ్ పోర్టల్, జగన్ 2.0 సూపర్ యాప్ విశేషాలను సమావేశంలో వివరించి, పార్టీ గ్లోబల్ డిజిటల్, సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.సమావేశాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, ఎన్ఆర్ఐ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. స్పష్టమైన లక్ష్యాలు, క్రమశిక్షణ, సమన్వయం, ఫలితాల ఆధారిత పనితీరుతో జగనన్న నాయకత్వాన్ని, ప్రపంచవ్యాప్తంగా వైఎస్సార్సీపీ కుటుంబాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# అమరావతి ఛాంపియన్షిప్ పోటీలలో ఆర్ ఆర్ అకాడమీ అథ్లెట్స్ ప్రతిభ.




**ఆళ్లగడ్డ జులై 29 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ నియోజకవర్గం అమరావతి ఛాంపియన్షిప్ పోటీలలో భాగంగా ఆళ్లగడ్డ ఆర్ ఆర్ అకాడమీ క్రీడాకారులు అథ్లెటిక్స్ అండర్- 17 విభాగంలో వివేకానంద 800 మీటర్ల పరుగుపందెం లో మొదటి స్థానం హేమంత్ నాయక్ లాంగ్ జంప్ మొదటి స్థానం జావలిన్ త్రో మొదటి స్థానంఓబులేసు షార్ట్ పుట్ మొదటి స్థానం అండర్ -23 విభాగంలో గోపి జావలిన్ త్రో లో మొదటి స్థానం సాధించారు వీరిని నంద్యాల జిల్లా క్రీడల అధికారి వి ఎం రాజు క్రీడాకారులను అభినందించారు.ఆగస్టు నెలలో నంద్యాలలో జరిగేటువంటి జిల్లా స్థాయి క్రీడా పోటీలలో కూడా తమ యొక్క ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని వారికి సూచించారు .అనంతరం
ఆళ్లగడ్డ ఆర్.ఆర్ అకాడమీ కోచ్ డి పి సుబ్బారాయుడు మాట్లాడుతూ గతంలో నంద్యాల లో అథ్లెటిక్స్ లో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో బంగారు పతకాలు సాధించి ఉద్యోగాలలో స్థిరపడ్డారని కావున క్రీడాకారులకు తెలియజేయడమేమనగా మీరు శిక్షణ తీసుకొని రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఆళ్లగడ్డకు ,నంద్యాల జిల్లాకు,మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ వి ఎం రాజు క్రీడాకారులను అభినందిస్తూ కోచ్ సుబ్బరాయుడును ఉద్యేసించి క్రీడాకారులకు ఇంకా మెరుగైన శిక్షణ పద్ధతులను అవలంబించాలని క్రీడల అభివృద్ధికి నంద్యాల జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఎప్పుడూ ఆర్ ఆర్ అకాడమీకి తోడ్పాటును అందిస్తుందని తెలిపారు.

# జూలై 31లోగా పంటల బీమా నమోదు చేసుకోవాలి

### పంట బీమాతో రైతులకు ఆర్థిక భద్రత: వ్యవసాయ అధికారి ముస్తక్ అహ్మద్




**గుత్తి, జూలై 29: (రిపబ్లిక్ న్యూస్)**
ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులను రక్షించేందుకు ప్రధానమంత్రి పంటల బీమా పథకం (పీఎంఎఫ్‌బీవై) కింద అర్హులైన రైతులందరూ జూలై 31లోపు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని గుత్తి వ్యవసాయ అధికారి ముస్తక్ అహ్మద్ సూచించారు. గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు పంటల బీమా విధానం, నమోదు ప్రక్రియ, అర్హతలు, అవసరమైన పత్రాలపై ఆయన సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహజ విపత్తులు, అకాల వర్షాలు, కరువు తదితర కారణాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించడమే పంటల బీమా ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రుణం తీసుకున్న రైతులతో పాటు రుణం తీసుకోని రైతులు కూడా ఈ పథకం కింద బీమా పొందే అవకాశం ఉందన్నారు.చాలా పంటలకు జూలై 31 చివరి తేదీ కాగా, వరి పంటకు మాత్రం ఆగస్టు 15 వరకు గడువు ఉందని తెలిపారు. గడువు ముగిసేలోపు రైతులు తప్పనిసరిగా నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు. పీఎంఎఫ్‌బీవై అధికారిక వెబ్‌సైట్, క్రాప్ ఇన్సూరెన్స్ మొబైల్ యాప్, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), వ్యవసాయ కార్యాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.దరఖాస్తు సమయంలో మొబైల్ నంబర్‌తో నమోదు చేసి, ఖరీఫ్ లేదా రబీ సీజన్‌ను ఎంపిక చేసుకుని, ఆధార్, భూమి వివరాలు, విత్తిన తేదీ నమోదు చేయాలని చెప్పారు. అనంతరం అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తును సమర్పించాలన్నారు. ఆధార్ కార్డు, భూమి పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, విత్తన ధృవీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.ప్రీమియాన్ని బ్యాంకులు, ఆన్‌లైన్ లేదా సీఎస్‌సీ కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని, ప్రభుత్వ సబ్సిడీతో రైతులకు తక్కువ భారం పడుతుందని తెలిపారు. రైతులు నమోదు సమయంలో సరైన వివరాలు ఇవ్వడంతో పాటు రసీదులను భద్రపరచుకోవాలని, పంట నష్టం సంభవించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.
బ్యాంకులు కూడా అర్హులైన రైతులను సకాలంలో నమోదు చేయాలని, రుణం లేని రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముస్తక్ అహ్మద్ పిలుపునిచ్చారు. "భీమా చేయండి పంటకు భద్రత పొందండి" అనే నినాదంతో రైతులందరూ చివరి తేదీ కోసం వేచి ఉండకుండా వెంటనే నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీఓ లలిత, ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ సురేంద్ర, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సుద్దవాగు రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

### ఎన్నికల హామీల అమలులో భాగంగా రూ.2.50 కోట్లతో పనులకు శ్రీకారం మంత్రి టీ.జీ. భరత్




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 29)**
గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్తా అన్నారు. నగరంలోని 23, 24వ వార్డుల పరిధిలో కేసీ కెనాల్ సమీపంలోని సుద్దవాగు వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రక్షణ గోడకు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాకాలంలో శ్రీరామ్‌నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో సుద్దవాగు పొంగిపొర్లడంతో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 250 మీటర్ల పొడవున రక్షణ గోడ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుకు నిధుల మంజూరులో జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సహకారం ఎంతో ఉందని మంత్రి తెలిపారు. అలాగే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో మరిన్ని నిధులు సమీకరించి సుద్దవాగుకు దశలవారీగా పూర్తి స్థాయి రక్షణ గోడ నిర్మాణం చేపడతామని వెల్లడించారు. నగరంలోని దశాబ్దాల నాటి సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో శాశ్వత పరిష్కారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.నగరంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వమే కారణమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గుజరాత్, సింగపూర్ తరహాలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ పరిశ్రమలను రాష్ట్రానికి ఆకర్షించేందుకు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా రానుందని ముఖ్యమంత్రి తనకు తెలిపినట్లు మంత్రి వెల్లడించారు.అనంతరం మంత్రి కేసీ కెనాల్‌లో బీటీఐ జీవ లార్విసైడ్ పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలించి, దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, భారీ వర్షాల సమయంలో సుద్దవాగు పరిసర ప్రాంతాల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు రక్షణ గోడ నిర్మాణం అత్యంత అవసరమని తెలిపారు. స్థానిక ప్రజల సమస్యలను గుర్తించిన మంత్రి టీ.జీ. భరత్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. శ్రీరామ్‌నగర్ వంతెన నుంచి కేసీ కెనాల్ వరకు 250 మీటర్ల మేర రక్షణ గోడ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో జలవనరుల శాఖ, నగరపాలక సంస్థ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# చె(చి)త్త శుద్ధి ఇదేనా..!

### - మహానంది ప్రధాన రహదారి పక్కన ఇదీ దుస్థితి



**మహానంది, జూలై 29, (రిపబ్లిక్ న్యూస్)**
స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర పేరుతో పంచాయతీ అధికారులు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది గ్రామ పంచాయతీలో మాత్రం పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే చెత్తాచెదారం ఉండటంతో స్థానికులతో పాటు క్షేత్రానికి వచ్చే ప్రముఖులు, భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే చిన్నచిన్న గ్రామాల్లో మరెలా ఉంటుందో అంటూ విమర్శిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మహానంది పరిధిలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని మహానంది గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఓఆర్ఎస్ ఒక సంజీవని లాంటిది: డా. సింధియా శుభప్రద

## ప్రపంచ ఓఆర్ఎస్ దినోత్సవం సందర్భంగా పర్ల గ్రామంలో అవగాహన కార్యక్రమం

## విరేచనాల నివారణలో ఓఆర్ఎస్ ప్రాధాన్యంపై వివరాలు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 29)**
ప్రపంచ ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో పర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఓఆర్ఎస్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డా. సింధియా శుభప్రద ఆధ్వర్యంలో, కార్యక్రమ నోడల్ అధికారి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వైష్ణవి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా డా. సింధియా శుభప్రద మాట్లాడుతూ, విరేచనాల వల్ల శరీరంలో కోల్పోయే నీరు, లవణాలను భర్తీ చేయడంలో ఓఆర్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రాణాలను సైతం కాపాడగల సామర్థ్యం





ఉన్నందున ఓఆర్ఎస్‌ను "సంజీవని"తో పోల్చవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన ఇంటర్న్లు, వైద్య విద్యార్థులు ఓఆర్ఎస్ తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి తల్లులు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. తల్లిపాలను నిరంతరం అందించడం, పరిశుభ్రమైన తాగునీటిని వినియోగించడం, భోజనానికి ముందు మరియు మరుగుదొడ్డి వినియోగం తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం వంటి ఆరోగ్య సూచనలను వివరించారు. అలాగే విరేచనాలు తీవ్రంగా ఉన్నప్పుడు ఆలస్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డా. వాల్మీకి శ్రీనివాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. రేణుక, పర్ల వైద్యాధికారి డా. నిరంజన్, నోడల్ అధికారి డా. వైష్ణవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. రవి నాయక్, డా. పుష్పలత, డా. ప్రసన్న రాణి, లెక్చరర్ సురేష్, ఎస్ఆర్ డా. ఆండ్రియల్, పీజీ విద్యార్థులు డా. శ్రీలక్ష్మి, డా. సభా, డా. పూజ, సూపర్వైజర్లు సాయిరాం, మాధవరాజు, పార్వతమ్మ, సుభాషిని, భవాని, విభాగ సిబ్బంది, ఇంటర్న్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వైభవంగా గాదిలింగేశ్వర బాబు జన్మదిన వేడుకలు

**గుంతకల్, జూలై 29:( రిపబ్లిక్ న్యూస్)**
గుంతకల్ మాజీ ఎమ్మెల్యే గాది లింగప్ప తనయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాది లింగేశ్వర బాబు (చిన్నబాబు) జన్మదిన వేడుకలు బుధవారం పట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శు



భాకాంక్షలు తెలిపారు. పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి గాది లింగేశ్వర బాబు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయనకు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు దక్కాలని ఆకాంక్షించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు మిఠాయిలు పంచి సంబరాలు జరుపగా, పార్టీ శ్రేణులు నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గాది లింగేశ్వర బాబును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, పార్టీ శ్రేణుల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపు

**అనంతపురం /చియ్యేడు, జూలై 29,(రిపబ్లిక్ న్యూస్):**
క్రీడా అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్2026 మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు.

**క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తా**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కల్పిస్తున్న అవకాశాలు, శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో విజయాలు సాధించి పాఠశాలలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు





సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

**చియ్యేడు బాలికలదే క్రీడల్లో హవా**

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో చియ్యేడు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. విద్యాశాఖ, ఆర్‌డీటీ, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ వాలీబాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో చియ్యేడు జడ్పీహెచ్‌ఎస్ బాలికలు విశేష ప్రతిభ కనబరిచారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో తొలి స్థానాలు సాధించి ఛాంపియన్‌గా నిలిచాయి. బాలికల కబడ్డీలో స్ఫూర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఖోఖోలో విజయ పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, వాలీబాల్‌లో జడ్పీహెచ్‌ఎస్ ఉప్పరపల్లి రన్నరప్‌లుగా నిలిచాయి. బాలుర విభాగంలో కబడ్డీలో జడ్పీహెచ్‌ఎస్ పాపంపేట విజేతగా, శ్రీ బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విజేతగా నిలవగా, వరుసగా స్ఫూర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్, జడ్పీహెచ్‌ఎస్ తాటిచెర్ల రన్నరప్‌లుగా నిలిచాయి. పోటీల్లో సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గురువారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి మంజుల, ఎంపీడీవో దివాకర్, ఆర్ఐ సందీప్, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, ఆర్‌డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్పి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న బాబు జన్మదిన వేడుకలలో

## రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేగులపాడు జూటూరు మారయ్య





**చిప్పగిరి, జూలై,29,( రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేగులపాడు జూటూరు మారయ్య బుధవారం గుంతకల్ వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న బాబుకి జన్మదిన శుభాకాంక్షలు వేడుకల్లో పాల్గొన్నారు, గాదిలింగేశ్వర బాబుకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో గుంతకల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, గుంతకల్ రంగా, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ ఉపాధ్యక్షులు బెల్డోన ఓబులేసు, చిప్పగిరి మండల కన్వీనర్ దేగులపాడు ఉనేబాద్ మల్లికార్జున, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, కుందనగుర్తి నాగప్ప, లోకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో ఘనంగా గురు పౌర్ణమి

## అత్యంత భక్తి శ్రద్ధలతో సాయినాధుడికి ప్రత్యేక పూజలు







**బండి ఆత్మకూరు, జూలై 29,( రిపబ్లిక్ న్యూస్):-** మండల కేంద్రం బండి ఆత్మకూరులో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం గురుపౌర్ణమి పురస్కరించుకొని స్థానిక శ్రీ షిరిడి సాయినాధుని మందిరంలో ప్రత్యేక విద్యుత్ ద్వీప అలంకరణతో పాటు సాయినాధుడిని రకరకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. పూజల అనంతరం సాయినాధుడి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. తర్వాత మంగళ హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయిబాబా మందిరంలో భజనలు, పుస్తక పారాయణం చేసి భక్తులు కాలక్షేపం చేశారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ మనలో అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించిన గురువులను ఆరాధించడం కోసమే ప్రత్యేకంగా గురుపౌర్ణమి జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ ద్వారానే ఫిర్యాదుల పరిష్కారానికి సంతృప్తి

## : కమిషనర్ చల్లా ఓబులేసు

## క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యల పరిశీలన

## గుంతల పూడ్చివేత, వీధి దీపాలు, డ్రైనేజీ పనులపై అధికారులకు ఆదేశాలు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 29)**
నగర ప్రజల నుంచి వివిధ రూపాల్లో అందుతున్న ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్జీదారులను ప్రత్యక్షంగా కలుసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సమస్యల పరిష్కార స్థితి, సాధ్యాసాధ్యాలను ప్రజలకు వివరించినప్పుడే వారు నిజమైన సంతృప్తి చెందుతారని ఆయన పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ కాలనీ, ఎన్జీవో కాలనీ, వెంకటాద్రి నగర్ ప్రాంతాల్లో ఫిర్యాదులకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించిన కమిషనర్, అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గుంతల పూడ్చివేత, వీధి దీపాల మరమ్మత్తులు, డ్రైనేజీ కాలువల నిర్మాణం వంటి పనులను తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గణేష్ నగర్,





శ్రీరామ్ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. అలాగే కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి అక్కడి సదుపాయాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి అధికారి, ఉద్యోగి తమ విధుల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అర్జీదారులతో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ఆర్థిక పరిమితులు, ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన పనుల గురించి స్పష్టంగా వివరించాలని ఆదేశించారు.
సమస్య పరిష్కారానికి కొంత సమయం అవసరమవుతుందని భావించి ఫిర్యాదును ముగించడం సరికాదని, తిరిగి ఫిర్యాదులు పునరావృతం కాకుండా వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ జనార్ధన్, శానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, ఫరూక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# చౌడేపల్లిలో వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

**చౌడేపల్లి ప్రతినిధి జూలై 29 రిపబ్లిక్ న్యూస్**
మండల కేంద్రమైన చౌడేపల్లిలో గురు పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఉదయాన్నే ప్రతి ఇంటి నుంచి పాలు తెచ్చి స్వామివారికి అభిషేకించారు ఈ వేడుకలను బోయకొండ మాజీ చైర్మన్లు ఎస్.కె. వెంకటరమణారెడ్డి, రతీదేవిల ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు



చేశారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. గురువుల విశిష్టతను, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను స్మరిస్తూ భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల సందర్భంగా దాతలు ఎస్.కె. వెంకటరమణారెడ్డి, రతీదేవి దంపతులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం వచ్చిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని రథంలో పెట్టి ఊరేగించారు ఈ ఆధ్యాత్మిక వేడుకలో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. విగ్రహ, కార్యక్రమం దాతలైన ఎస్ కే ఆర్ దంపతులను ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు స్వామి వారికి ఎస్కె వెంకటరమణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించింది.

# చెడ్డి గ్యాంగ్ పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## : ఎస్సై చిన్న రెడ్డప్ప

**చౌడేపల్లి ప్రతినిధి జూలై 29 రిపబ్లిక్ న్యూస్**
చెడ్డి గ్యాంగ్ కదలికల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌడేపల్లి ఎస్సై చిన్నారెడ్డప్ప విజ్ఞప్తి చేశారు బుధవారం స్థానిక పోలీసు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడారు మాట్లాడారు. సమావేశంలో పీలేరు పరిసరాల పరిధిలో చెడ్డి గ్యాంగ్ కదలికలకు సంబంధించి సమాచారం అందిందని తెలిపారు. ఇలా వచ్చిన సమాచారంతో పోలీసులు చౌడేపల్లి పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారన్నారు. మండల పరిధిలోని మేక, బాతుల లేదా ఇంటి అనుమానాస్పద, సంచరించే వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వారి కదలికలను గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలు ప్రధానంగా పట్టణ శివార్లు, బస్టాండ్, ప్రాంతాలలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల పక్కరాష్ట్రంలో దొంగతనం జరిగిన నేపథ్యంలో స్థానిక శాఖ మరింత అప్రమత్తంగా కనురెప్పవాల్చకుండా విస్తృతంగా గస్తీకాయడం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చెడ్డీ గ్యాంగ్ కదలికలను అడ్డుకునే భాగంలో జిల్లాలో రాత్రి సమయాల్లో గస్తీ మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక సిబ్బంది ద్వారా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఏమాత్రం సందేహాస్పద సమాచారం ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు.

# ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌కు భూమి పూజ



**ఎమ్మిగనూరు, జూలై 29, (ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**ఎమ్మిగనూరు పట్టణానికి సమీపంలోని బనవాసి ఫారం వద్ద ప్రతిష్ఠాత్మక ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ, ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ఎమ్మిగనూరు అభివృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఆధునిక వసతులు, విశాలమైన రహదారులు, మెరుగైన మంచినీటి సౌకర్యం, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంతో టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. టౌన్‌షిప్‌కు సమీపంలో నవోదయ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి ఫారం, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో విద్య, ఉపాధి, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.






# సువార్తికురాలి చికిత్సకు ఆర్థిక చేయూత

**మానవత్వం చాటుకున్న పాస్టర్స్ అసోసియేషన్**

**బాధితురాలికి సంఘం తరపున అండగా ఉంటాం -పాస్టర్ రెడ్డి నెహెమ్యా నాగరాజు**



**అనంతపురం ప్రతినిధి, జూలై 29,(రిపబ్లిక్ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సువార్తికురాలు జె. ప్రతిభ మనోహరికి అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ రెడ్డి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పి. మార్క్, కార్యదర్శి పాస్టర్ జి.ఆర్. ఆనంద్, సంయుక్త కార్యదర్శి పాస్టర్ వి. మనష్షే, ఖజాంచి పాస్టర్ కె. జీవన్ బాబు, కార్యవర్గ సభ్యులు పాస్టర్ జాషువా జహంగీర్, పాస్టర్ శాంత వర్ధన్ తదితరులు నగరంలోని శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతిభ మనోహరిని బుధవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఆమెకు కాలర్‌బోన్ విరగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**తోటి సేవకులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత**

ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అవసర సమయంలో తోటి సేవకులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్థిక సహకారం అందించిన అసోసియేషన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, దేవుని ఆశీస్సులు వారిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. త్వరలోనే ప్రతిభ మనోహరి పూర్తిస్థాయిలో కోలుకుని తిరిగి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రార్థించారు.

# సైన్స్ టీచర్ విధులకు డుమ్మా



**హెచ్ఎం సైన్స్ టీచర్ మధ్య అంతర్గత విభేదాలు**

**నాణ్యమైన విద్య బోధన విద్యార్థులకు**

**ఇది నార్పల ప్రభుత్వ పాఠశాల దుస్థితి**

**ప్రాక్టికల్స్ ల్యాబ్ దుర్వినియోగం**

**తలలు పట్టుకుంటున్న విద్యార్థులు**

**ఉపాధ్యాయులపై చర్యలు చేపట్టాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి**



**అనంతపురం/నార్పల ఎడ్యుకేషన్,జూలై 29,(రిపబ్లిక్ న్యూస్):** విద్యార్థులకు విద్యా బోధన చేయాల్సిన ఓ సైన్స్ టీచర్ విధులకు డుమ్మా కొడుతోంది. ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఆమెకు హెచ్ ఎం కు మధ్య అంతర్గత విభేదాల వల్ల విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని కొందరు విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ల ఉపాధ్యాయురాలు, హెచ్ఎం లు కలిసి చదువే రా చక్కని నేస్తం అది ఉంటే అన్నీ సాధ్యం అనే వీటికి తూట్లు పొడుస్తున్నారనే చెప్పవచ్చు.

**ప్రాక్టికల్స్ ను బోధించకుండా ఆమె కాలయాపన**

అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ సైన్స్ ఉపాధ్యాయురాలు విద్యార్థులకు సక్రమంగా బోధన చేయడం లేదని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతుండడం గమనార్హం. అందులో భాగంగా పాఠశాలలో ఉపాధ్యాయురాలు విద్యార్థులకు సరిగా పాఠాలను బోధించకుండా ఉందని, సైన్స్ ల్యాబ్ లో విద్యార్థులకు ప్రాక్టికల్స్ ను బోధించడంలో తీవ్ర ఆలస్యం చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాక సైన్స్ ల్యాబ్ వినియోగించకుండా, అందులో విద్యార్థులకు ప్రాక్టికల్స్ ను బోధించకుండా ఆమె కాలయాపన చేస్తోందని చెప్పారు.

**ల్యాబ్ వినియోగించే అవకాశం లేక శిక్షణకు దూరం**

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సంబంధిత ఉపాధ్యాయురాలి మధ్య అంతర్గత విభేదాల ప్రభావం వల్ల విద్యార్థుల విద్య బోధనపై పడుతోందని వారు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, సైన్స్ ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన ల్యాబ్ తాళం సంబంధిత సైన్స్ లెక్చరర్ వద్దే ఉండడంతో ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించలేకపోతున్నారని తెలిపారు. ల్యాబ్ వినియోగించే అవకాశం లేక విద్యార్థులు ప్రాక్టికల్ శిక్షణకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తపరిచారు.

**సైన్స్ ల్యాబ్ తో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలి**

ల్యాబ్ గదిని విద్య బోధనలకు ఉపయోగించాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత అవసరాల నిమిత్తం వినియోగిస్తున్నారన్నారు. దీంతో విద్యార్థులు చదువుకునే సమయం వృధా అవ్వడమే కాక, చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి పై జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించకుండా ఉన్న సైన్స్ ఉపాధ్యాయురాలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే విద్యార్థుల బోధన కోసం ఉపయోగించే సైన్స్ ల్యాబ్ ను ఉపాధ్యాయులు సక్రమంగా వినియోగించి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని తల్లిదండ్రులు కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు విధులలో మునుపటిలాగే ప్రవర్తించి అలసత్వం వహిస్తే సహించేది లేదని ముక్తకంఠంతో తెలిపారు.

# గురుపౌర్ణమి వేళ షిర్డీ సాయిబాబా దర్శనం

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న**

**మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి**

**ప్రజలందరికీ గురుపౌర్ణమి శుభాకాంక్షలు**

**బాబా ఆశీస్సులు సర్వలోకానికీ కలగాలని ఆకాంక్ష**

**అనంతపురం/బీకేసి ఆధ్యాత్మికం, జూలై 29,(రిపబ్లిక్ న్యూస్):** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శింగణమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుక్కరాయసముద్రం మండల పరిధిలోని చెరువు కట్టపై ప్రతిష్ఠాత్మకంగా వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని బుధవారం సందర్శించారు. సాయిబాబా సన్నిధిలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, రైతాంగ సంక్షేమం, యువత అభివృద్ధి, సమాజంలో శాంతి, సామరస్యం నెలకొనాలని ప్రార్థించారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనాలు చేశారు.



ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందించి సన్మానించారు.

**ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలి**

ఈ సందర్భంగా జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ గురుపౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని చాటిచెప్పే అత్యంత పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. శ్రీ షిర్డీ సాయిబాబా బోధించిన సేవా భావం, మానవత్వం, సత్యం, సహనం, సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సాయిబాబా ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో



శాంతి, అభివృద్ధి, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా జిల్లా ప్రజలకు, భక్తులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, గురువు మార్గదర్శనం జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండిఅంజి బాబు డిమాండ్**





**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 29(రిపబ్లిక్ న్యూస్)** పారిశ్రామిక కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు కలెక్టర్ కార్యాలయం దగ్గర జూలై 30వ తేదీన జరుగు ధర్నా సంబంధించిన కరపత్రాలను ఓర్వకల్లు జయరాజ్ స్టీల్ ప్లాంట్ దగ్గర పంపిణీ చేశారు సిఐటియు మండల అధ్యక్షకార్యదర్శి ఎస్ షాజహాన్ జిశ్రీధర్ సిఐటియు మండల నాయకులు రాజు కేశవులు అశోక్ తదితరులు పాల్గొని కరపత్రాల పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వాలు వేతనాలు పెంచాలని కోరారు,కనీస వేతనం 26 వేల రూపాయలు ఉండాలని డిమాండ్ చేశారు పక్కన ఉన్న కర్ణాటక ప్రభుత్వం కనీస వేతనం 32 వేల వరకు పెంచిందని తెలియజేశారు మీస వేతనాల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల దగ్గర ఆందోళన చేస్తున్నట్లు తెలియజేశారు ఆందోళనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు

# పర్యావరణ పరిరక్షణకు ఈడిగ సంఘం చేయూత

**కురుగుంటలో 200 ఈత మొక్కల నాటకం**

**అనంతపురం రూరల్, జూలై 29,(రిపబ్లిక్ న్యూస్):** పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా అనంతపురం రూరల్ మండలంలోని కురుగుంట గ్రామంలో ఈడిగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం 200 ఈత మొక్కలను నాటారు. అనంతపురం రూరల్ ఈడిగ సంఘ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈడిగ సంఘ అధ్యక్షుడు మేకల వేణుగోపాల్ గౌడ్, కిరణ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.



వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృత స్థాయిలో మొక్కల



పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈడిగ సంఘ నాయకులు, సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటడంలో భాగస్వాములయ్యారు.

# కన్న మడకల గ్రామంలో టిడిపి డోర్ టు డోర్ కరపత్రాలు పంపిణీ

**ఓర్వకల్లు మండలం టిడిపి కన్వీనర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో**



**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 29(రిపబ్లిక్ న్యూస్)** బుధవారం రోజుపాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు నంద్యాల జిల్లా అధ్యక్షురాలుగౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు ఓర్వకల్ మండలం కన్నమడకల గ్రామం, బూత్ నెం. 238 పరిధిలో ఇంటింటి ప్రచార కార్యక్రమం ) విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల అధ్యక్షులు దుగ్గపూటి నాగిరెడ్డి ఓర్వకల్లు సింగిల్ విండో చైర్మన్ సీసి. సుధాకర్ రావు , కిరణ్ కుమార్ బొల్లవరం శ్రీనివాసులు, మౌలాలి,ఎల్లనాగన్న,సూరన్న ఈశ్వరయ్య,తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలుఉత్సాహంగాపాల్గొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి ఇంటిని సందర్శించి ప్రచారం నిర్వహించారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్యానికి 'మ్యాజిక్ డ్రెయిన్స్'తో శాశ్వత పరిష్కారం

**కేంద్ర పథకాల అమలు, మౌలిక సదుపాయాల పనులు వేగవంతం చేయాలి**

**మంజూరైన అభివృద్ధి పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేసి, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు 'మ్యాజిక్ డ్రెయిన్స్' నిర్మాణాన్ని చేపట్టి, అపరిశుభ్రత సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సిమెంట్ కాంక్రీట్ రహదారులు నిర్మించినప్పటికీ,



మురుగు నీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల అపరిశుభ్ర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా "మ్యాజిక్ డ్రెయిన్స్" నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో అనువైన స్థలాలను గుర్తించి, క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించి, వీలైనంత త్వరగా మ్యాజిక్ డ్రెయిన్స్ నిర్మాణ పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత సంక్షేమ పథకాల అమలులో జిల్లాలు మెరుగైన ప్రగతి సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. పథకాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన వ్యయాలను సకాలంలో నమోదు చేయడంతో పాటు, అమలులో ఎదురవుతున్న సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర అడ్డంకులను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అదేవిధంగా శానిటరీ కాంప్లెక్స్‌లు, వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు మంజూరైన ఈ పనులన్నింటిలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ లక్ష్యాలను నిర్దేశించుకుని గడువులోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ, కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

**విద్యార్థి సంఘాల డిమాండ్**



**ఎమ్మిగనూరు, జూలై 29,( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**స్థానిక ఎమ్మిగనూరులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘాలు, డీఎస్‌వైఏ మరియు ఆర్వీఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షులు నరసన్న యాదవ్, నాయకులు వెంకటేష్, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ, కాలేజీ హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో సరిపడా బాత్రూములు లేకపోవడం, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాంఘిక సంక్షేమ, కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా మంజూరైన మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల తరగతులను వెంటనే ప్రారంభించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయ్, రమేష్, కిరణ్, కృష్ణ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జోగిపేటలో గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజలు..

### భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు





**అందోల్ ప్రతినిధి జులై 29 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**గురు పౌర్ణమి సందర్భంగా ఈరోజు జోగిపేట పట్టణంలోని షిర్డీ సాయి బాబా దేవాలయం మరియు సత్య సాయి బాబా దేవాలయం లో జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఏఎంసి చైర్మన్ డి బి నాగభూషణం బి ఆర్ ఎస్ నాయకులు చాపల వెంకటేశం మరియు బందం రాములు, వీరేషం, మల్లేశం, వడ్ల రాములు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సత్య సాయి బాబా దేవాలయం లో సామూహిక సత్య నారాయణ వ్రతాలు నిర్వహించరు రెండు దేవాలయాల్లో భక్తులు అందరికీ అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించారు షిర్డీ సాయి బాబా ఆలయం లో వడ్ల సుధాకర్, రాములు అర్చకులు యోగేష్ ఆశీర్వచనం ఇచ్చారు.

## వైకుంఠం జ్యోతి కి సమస్య వివరించాము వెంటనే స్పందించి రెండు లక్షలు మంజూరు

### మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు





**చిప్పగిరి, జూలై ,29( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి చెందిన కొత్త ఇంటి వీరాంజనేయులు తెలుగుదేశం కార్యకర్తకు 25వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చినప్పుడు చిప్పగిరి మండల కన్వీనర్ కొండ పురుషోత్తం ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్లామని ఇన్చార్జి గారు వెంటనే స్పందించి ఫైల్ సీఎం దృష్టికి తీసుకెళ్లారని ఆరోగ్యం బాగాలేక 2021 సంవత్సరంలో ఆపరేషన్ చేయించినందుకు గాను మూడు లక్షలు ఖర్చు అయిందని చెప్పగానే వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు లక్షలు మంజూరు చేశారని, బుధవారం బాధితుడికి వైకుంఠం జ్యోతి చేతుల మీదుగా అందించారని తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ నేమకల్ వలి, క్లస్టర్ ప్రభాకర్, సీనియర్ నాయకుడు రామదుర్గం తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధిపై అవగాహన శిక్షణ కార్యక్రమం



**ఎమ్మిగనూరు , జూలై 29,( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఆర్థికాభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్‌లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన మండలస్థాయి అధికారులు, స్వర్ణాంధ్ర సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డైరెక్టర్ బి. గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై పలు కీలక అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. గ్రామాలు, మండలాల ఆర్థిక పరిస్థితులను వివిధ అభివృద్ధి సూచికల (ఇండికేటర్స్) ఆధారంగా విశ్లేషించి, నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పహలే ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో శాస్త్రీయ విధానాలను అనుసరించాల్సిన అవసరాన్ని వారు వివరించారు. శిక్షణలో పాల్గొన్న వివిధ మండలాలు, డివిజన్ల అధికారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా మండలాల వారీగా యూనిట్లను ఎంపిక చేసి అధికారులకు మరింత శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర డైరెక్టర్ బి. గోపాల్ సూచించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జి. భారతి అధ్యక్షత వహించి, నియోజకవర్గాల ఆర్థికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, స్వర్ణాంధ్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓర్వకల్లులో జీటీడీపీ విజన్ ప్లాన్‌పై జెడ్పీ సీఈఓ సమీక్ష





**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 29(రిపబ్లిక్ న్యూస్)**జెడ్పీ సీఈఓ ఆర్. సుధాకర్ రెడ్డి ఓర్వకల్లు మండలంలో జీటీడీపీ విజన్ ప్లాన్ అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, రైతులు డ్రిప్ పద్ధతి, అంతర పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఆగస్టు 5న జరిగే మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు

## నిర్వహించిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి.









**రైల్వే కోడూరు జులై 29 రిపబ్లిక్ న్యూస్.**

గురు పౌర్ణమి సందర్భంగా బుధవారంఓబులవారిపల్లె మండలం కొత్త మంగంపేట ఆర్ఆర్ 2 లో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది, స్థానిక భక్తులు బాలా మరియు వారి సోదరుల ఆహ్వానం మేరకు రాయలసీమ జోన్ వైసిపి బూత్ కమిటీ అధ్యక్షులు, డి ఆర్ యు సి సి సభ్యులు తల్లం భరత్ కుమార్ రెడ్డి విచ్చేసి షిరిడి సాయిబాబా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ పూజారి వేదమంత్రాలు చదివి ఆయనకుపూజరి తీర్థ ప్రసాదాలు అందజేశారు,అలాగే, రైల్వేకోడూరు మండలం బుడుగుండుపల్లి పంచాయతీలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో అదునుకోట నరసింహస్వామి ఆహ్వానం మేరకు స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రైల్వే కోడూరు మండలంలోని గొల్లపూడి వెంకయ్య స్వామి గుడిలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం రాయలచెరువు సమీపంలో ఉన్న శ్రీ శక్తి పీఠాన్ని దర్శించారు. అక్కడ వెలసియున్న శ్రీ వారాహి అమ్మవారు, పరమశివుడు, కాళికాదేవి మరియు కాలభైరవ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు అందుకున్నారు.

ఈ కార్యక్రమాల్లో మంగంపేట యూత్ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, కమిటీ సభ్యులు గంగాధర్ రెడ్డి, శ్రీను, రమణ, సునీల్, బాలా, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను ప్రజా స్వామ్య పర్యవేక్షణకు దూరంచేసే సర్కులర్ ను వెంటనే రద్దు చేయాలి.డా.పి.పెంచయ్య.

**రైల్వే కోడూరు జూలై 29 రిపబ్లిక్ న్యూస్.**

ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించే వ్యవస్థలపై ఆంక్షలు పెట్టడం అప్రజా స్వామికమని, అఖిలభారత అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పెంచలయ్య బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు,సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ ఏప్రిల్ 7వ తేదీన జారీ చేసిన సర్కులర్ ,హాస్టళ్ళలలో అనధికార ప్రవేశాల నివారణ సర్కులర్ ప్రజాస్వామ్య స్ఫూర్తి కి,ప్రశ్నించే మీడియా స్వేచ్ఛకి ప్రజాస్వామ్య పరిరక్షణ కొరకు పనిచేసి ప్రజాసంఘాల మరియు విద్యార్థి సంఘాల స్వేచ్ఛకు విరుద్ధమని ,అదేవిధంగా భారత రాజ్యాంగం కల్పించిన బావ స్వేచ్ఛా ప్రకటనకు విరుద్ధంగా ఉందని డాక్టర్ పి. పెంచలయ్య తీవ్రంగా ఆరోపించారు, సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల భద్రత గోప్యత ప్రభుత్వ బాధ్యత అయితే ఆ పేరుతో మీడియా ప్రజాసంఘాలు విద్యార్థి సంఘాలు మరియు సామాజిక సంస్థలు జిల్లా అధికారుల అనుమతి లేనిదే హాస్టల్లో ప్రవేశం లేదని సర్కులర్ జారీ చేయడం ప్రజాస్వామ్య పర్యవేక్షణను అడ్డుకోవడమేఅని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చుకోవాలని ఆయన కోరారు,ఇలాంటి సర్కులర్ నియమ నిబంధనల వ్యవహారాల వల్ల హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు కులవివక్షత అవినీతి నాసిరక ఆహారం మౌలిక వసతుల లోపాలు అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలు బయట పడకుండా ఉండే ప్రమాదం ఉందని, ఇది సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదువుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాల పేదల విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదంగా మారే అవకాశం ఉందని, ప్రభుత్వం ఇచ్చిన సర్కులర్ను రద్దు చేసుకోవాలని డాక్టర్ పెంచలయ్య డిమాండ్ చేశారు,గతంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగిన పరిస్థితులు ఉన్నాయన్నారు, ప్రభుత్వ నిధులతో నడిపే సాంఘిక సంక్షేమ హాస్టల్లు మరియు ప్రజా సంస్థలు వాటి పనితీరుపై ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు మీడియాలకు ప్రశ్నించే హక్కు కు వ్యతిరేకముగా నిబంధనలు విధించే సర్కులర్ ప్రజాస్వామ్యానికి గుద్దలు



పెట్టని విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదమని ఆయన అన్నారు, ప్రజాస్వామ్యంలో జవాబుదారితనం పారదర్శకత మరింత బలోపేతం కావాలి కానీ ఆంక్షలు పేరుతో అడ్డుకోవడం మూసేయడం చాలా అన్యాయం దారుణం ఇది సమంజసం కాదన్నారు, విద్యార్థులను బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి వసూళ్లకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే ఆ కారణాన్ని బట్టి ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు మీడియాపై ఒకే విధమైన అప్రజాస్వామిక వైఖరితో ఆంక్షలు విధించడం అన్యాయం. అందువల్ల ఈ అన్యాయమైన సర్కులర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థుల భద్రతను కాపాడుతూనే ప్రజాస్వామ్య హక్కులు మీడియా స్వేచ్ఛ సామాజిక పర్యవేక్షణకు భంగం కలగని విధంగా నూతనమైన మార్గదర్శకాలను రూపొందించాలని డా.పి. పెంచలయ్య డిమాండ్ చేశారు

## చిట్వేలి మండల తాసిల్దార్ ప్రజలుకు అందుబాటులోకి రాకపోతే పోరాటాలకు సిద్ధం :సిపిఐ

**రైల్వే కోడూరు జూలై 29 రిపబ్లిక్ న్యూస్.**

చిట్వేలి మండల తాసిల్దార్ మండలంలోని ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల పేద ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ముందుకు రాకపోతే సిపిఐ పోరాటాలకు సిద్ధం అవుతుందని రైల్వే కోడూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య డిమాండ్ చేశారు, చిట్వేలి మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ నాయకులు నిరసన తెలియజేశారు, ఈ కార్యక్రమం చిట్వేలి మండల సిపిఐ నాయకులు తిప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగినది,

నిరసన అనంతరం దళితుల సమస్యలపై డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు

డిప్యూటీ తాసిల్దార్, మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు అనంతరం జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ చిట్వేలి మండలంలో మండల వ్యాప్తంగా ప్రభుత్వ భూములు భూకబ్జాలకు గురువుతుంటె నిమ్మకు నీరేత్తినట్లు తాసిల్దార్ నరసింహులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు,గతంలో ఉన్న తాసిల్దార్ మురళీకృష్ణ ప్రభుత్వ భూములను కబ్జాదారులు చేతల్లోకి పోకుండా కాపాడుకుంటూ వస్తూ నిరుపేద ఎస్సీ ఎస్టీ దళిత





కుటుంబాలకు అండగా నిలిచారని కంప సముద్రం పంచాయతీ బాలాజీ కాలనీ ఎస్సీ కాలనీవాసులకు ఇంటి స్థలాలు లేవని గ్రామం లోకి పోయి చూసి ఒక్కొక్క ఇంట్లో మూడు. రెండు ఫ్యామిలీలు ఉన్నారని ఇది బాధాకర విషయమని ప్రభుత్వం స్పందించాలని ఆయన కోరారు దళితవాడ పక్కనే ప్రభుత్వ బంజర భూమి సర్వేనెంబర్ 393లో ఉన్న స్థలాన్ని గ్రామానికి కేటాయించి ఆ గ్రామస్తులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సదరు భూమిని సర్వే చేసి లేఅవుట్ వేసి గ్రామస్తులు కు పట్టాలు ఇవ్వాలని పేర్లు లిస్ట్ అవుట్ చేసి దళితులకు ఇవ్వాలని అనుకున్నప్పటికీ తాసిల్దార్ మురళి కృష్ణ బదిలీ అవడంతో సదరు భూమి అలాగే పెండింగ్ పడిందని అన్నారు.

మధ్యలో వచ్చిన ఒక తాసిల్దార్ మేడం కబ్జాదారులకు వంతపాడి ప్రలోభాలకు లోనై పేద ప్రజలకు అన్యాయం చేసిందని ఆరోపించారు, ఇప్పటికైనా ఇప్పుడు ఉన్నటువంటి తాసిల్దార్ నరసింహులు బాలాజీ నగర్ కాలనీవాసులకు గ్రామం పక్కనే ఉన్న ఒక్క ఎకరా 15 సెంట్లు స్థలాన్ని అదే గ్రామానికి ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు, మండల తాసిల్దార్ స్పందించి బాలాజీ నగర్ ఎస్సీ కాలనీవాసులకు గ్రామం పక్కనే ఉన్న స్థలాన్ని గ్రామస్తులకు కేటాయించాలని తెలియజేశారు,

ఈ కార్యక్రమంలో చిట్వేలి సిపిఐ మండల నాయకులు. సామా గంగయ్య.ఈరి లక్ష్మీనారాయణ డి హెచ్ పి ఎస్ చిట్వేలి మండల కార్యదర్శి రవి తదితరులు పాల్గొనడం జరిగినది

## 'తల్లికి వందనం' నిధులపై కన్నేసిన మోసగాళ్లు అరెస్ట్

### 24 గంటల్లో కేసు ఛేదించిన కర్నూలు వన్‌టౌన్ పోలీసులు

### 105 ఏటీఎం కార్డులు, బయోమెట్రిక్ పరికరం, రూ.5 లక్షల నగదు స్వాధీనం

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 29)**

'తల్లికి వందనం' పథకం లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని ఎయిర్‌టెల్ సిమ్ కార్డుల పేరుతో మోసాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను కర్నూలు వన్‌టౌన్ పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేసి కేసును ఛేదించారు. నిందితుల వద్ద నుంచి 105 ఏటీఎం కార్డులు, రెండు సెల్‌ఫోన్లు, ఒక బయోమెట్రిక్ ఫింగర్‌ప్రింట్ పరికరం, రూ. 5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కర్నూలు నగరంలోని గడ్డా వీధికి చెందిన షేక్ ముంతాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఉచిత ఎయిర్‌టెల్ సిమ్ కార్డులు ఇస్తామని నమ్మబలికి బాధితుల వేలిముద్రలు, ఐరిస్ స్కాన్, ఆధార్ వివరాలను సేకరించిన నిందితులు, వారి పేర్లపై ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలు తెరిచి ఏటీఎం కార్డులు పొందారు. అనంతరం ప్రభుత్వ 'తల్లికి వందనం' పథకం కింద జమ అయిన



నిధులను బాధితులకు తెలియకుండా ఉపసంహరించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. గడ్డా వీధి, అలీ షా బాగ్, చిత్తారి వీధి, ఖాదక్‌పేట తదితర ప్రాంతాలకు చెందిన పలువురు మహిళలు ఇదే తరహా మోసానికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు 10 మంది బాధితుల వాంగ్మూలాలు నమోదు చేసి బ్యాంకు లావాదేవీల వివరాలను సేకరించారు. దర్యాప్తులో కర్నూలు నగరంలోని చిత్తారి వీధికి చెందిన నుకల ఉపేంద్ర (26), ప్రస్తుతం భూదవారపేటలో నివాసముంటున్న ఎయిర్‌టెల్ ఉద్యోగి బోడేపాడు వీరారెడ్డి (38) ఈ మోసాలకు పాల్పడినట్లు తేలింది. వీరు ముందుగానే ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు సేకరించి, వారి బయోమెట్రిక్ సమాచారంతో ఖాతాలు తెరిచి, ఏటీఎం కార్డుల ద్వారా సుమారు రూ. 5.85 లక్షలు ఉపసంహరించుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ జి. మారుతి శంకర్, సీసీఎస్ సీఐ పూల రామకృష్ణ, సైబర్ సెల్ సీఐ వై. ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. నగరంలోని ఐదు ఏటీఎం కేంద్రాల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, నిందితుడు ఉపేంద్ర బాధితుల ఖాతాల నుంచి నగదు ఉపసంహరిస్తున్న దృశ్యాలు లభించాయి. వాటిని కీలక సాక్ష్యాలుగా స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టు చేసిన నిందితుల వద్ద నుంచి రూ. 5 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, 105 ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ మరియు ఫినో ఏటీఎం కార్డులు, ఒక బయోమెట్రిక్ ఫింగర్‌ప్రింట్ పరికరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. ఉచిత సిమ్ కార్డులు, ప్రభుత్వ పథకాల పేరుతో బయోమెట్రిక్ వివరాలు, ఆధార్ సమాచారం కోరే వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేసును వేగంగా ఛేదించిన దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు అడుగు మందు 1350రూపాయల కి ఇవ్వాలని, 24 గంటలు కరెంటు ఇవ్వాలని.....

## ----మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ జీవన్ రెడ్డి డిమాండ్

**రాయికల్ మండలం జూలై,29( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణ కేంద్రంలో పత్రిక సమావేశంలో పాల్గొన్నారు. మాజీ మంత్రి బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాజీ జడ్పీ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్

ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపర్తి జఖ రెడ్డి,బర్కం మల్లేష్, గోపి రాజిరెడ్డి,కొయ్యేడి మైపాల్,హరీష్ రావు, శ్రీధర్ రెడ్డి,రవి మరియు వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా

జీవన్ రెడ్డి మాట్లాడుతూ...కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీటిని తరలింపు చేసే అవకాశం ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి కేవలం బేష జాలం తోని కేసీఆర్ కి పేరు వస్తుందని నీటి తరలింపు చేయలేనప్పటికిరేవంత్ రెడ్డి కి తెలంగాణ రైతాంగం పై దయ లేనప్పటికీ దేవుడు దయతలిచి వర్షాలు రావడం రైతాంగానికి కొద్దిగా ఊరట కలిగించే విషయం ఖరీఫ్ పంట సాగు ప్రశ్నార్థకమైపోయింది

రైతులు ఎం చేయాలో తెలియని పరిస్థితిలో రైతాంగం ఉంటే ఈ రోజు అల్పపీడనం దేవుడు దయతలచి ఈ



వర్షాలు రావడంతోని రైతాంగానికి ఊరట కలగడం పోసిన నార్లు ఎదిగిపోయి సిద్ధంగా ఉన్న నారు వేసే అవకాశం లేక రైతులు ఆందోళనలోతో ఉండే

ఈ వర్షాలతో ఎదిగిన నారు నాటు వేసుకునే అవకాశం ఉన్నది రేవంత్ రెడ్డి ఇప్పటికి అయిన విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 24 గంటలు విద్యుత్ ఇచ్చి రైతాంగానికి తోడుగా నిలవడం జరిగిందో ఇప్పుడు విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటల విద్యుత్ అందిశీప చేయాలి ఎరువులు ముక్యంగా అడుగు మందు 20-20 ఎరువు రకం 2150 రూపాయలు మరియు డీఏపీ 1950 రూపాయలు ఉన్నది అడుగు మందు కొరత లేకుండా బ్లాక్ కాకుండా 1350 రూపాయలకి అందరికి అందుబాటులో ఉండే విదంగా అలాగే 20 20 కల్పింప చేయడంతో పాటుగా యూరియా అప్ కూడా తొలగిశీచి వేయాలి

విద్యుత్ మరియు ఎరువుల సమస్య ఉత్పన్నం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి పైన ఉన్నది

నిన్నటి వరకు నిర్లక్ష్యం తోని గాలికి వదిలేశారు మీరు గాలికి వదిలేశిన ఈ రోజు దేవుడు కరుణించాడు

ఈ వర్షాలతోని రైతాంగానికి మళ్ళీ ఆశలు కలిగాయి రైతులు సాగుకు ముందుకు వెళ్తున్నందుకు విద్యుత్ సమస్య ఫర్టిలైజర్ ఎరువులకు సంబంధించి అడుగు మందు కానీ యూరియా కానీ ఏ విధమైన సమస్య ఉత్పన్నం కాకుండా పూర్తి స్థాయిలో కల్పింప చేయడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు

# రైతు వేదికలలో విత్తనమేల రైతులకు న్యాయ సేవ పై అవగాహన జిల్లా బి. సౌజన్య

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 29( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన విత్తన మేళాలో భాగంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య ముఖ్య అతిథిగా పాల్గొని రైతులు, మహిళలు, గ్రామస్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె నాల్సా జాగృతి పథకం గురించి వివరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ న్యాయ హక్కులను తెలుసుకొని అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వ సేవలు మరియు ఇతర న్యాయ సేవలను పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని, మహిళలు,




చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన వర్గాలు తమకు చట్టపరంగా కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని సూచించారు.

అలాగే రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళా ప్రాముఖ్యతను వివరించి, ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించడం, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించడం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. వివాదాలు తలెత్తినప్పుడు కోర్టులను ఆశ్రయించడంతో పాటు, సాధ్యమైనంత వరకు మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు న్యాయ సేవల కోసం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి సౌజన్య గారు, మండల రెవెన్యూ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, గ్రామస్థులు మరియు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయ స్వామి అనుగ్రహంతో ప్రజలు చల్లగా ఉండాలి

## ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**సంగారెడ్డి ప్రతినిధి జులై 29 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

దత్తాత్రేయ స్వామి అనుగ్రహంతో ప్రజలు చల్లగా ఉండాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని మధుర దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దత్తాత్రేయ స్వామి వారి అనుగ్రహం తో నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని కోరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కోరారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ని శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో హత్నూర సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య,మాజీ ఎంపీ పి వావిలాల నర్సింలు,మండల పార్టీ అధ్యక్షుడు రాం చంద్రా రెడ్డి,దౌల్తాబాద్ ఉప సర్పంచ్ పటేల్ శేఖర్ గౌడ్,యువజన నాయకుడు తుమ్మల పల్లి కిషోర్,నాయకులు నరసింహ రెడ్డి,లింగం గౌడ్,మధుర సర్పంచ్ నవీన్ గౌడ్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిసిన గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జూలై 29 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామిని గుండ్ల మాచునూర్ గ్రామ సర్పంచ్ శ్రీహరి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. గ్రామంలో క్రీడాకారుల కోసం మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు, పెండింగ్ అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ శ్రీహరి తెలిపారు

# వైభవంగా గురుపౌర్ణమి మహోత్సవాలు

## షిరిడి సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు

## భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం

## నిరంతర సేవలో సుధాకర్ దంపతులు



**అనంతపురం ఆధ్యాత్మికం, జూలై 29,(రిపబ్లిక్ న్యూస్):**

నగరంలో అత్యంత వైభవంగా గురుపౌర్ణమి మహోత్సవాలునిర్వహించారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులోని ఓం నగర్‌లో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో మహోత్సవాలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి సాయిబాబా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో అలరారగా, సాయినామ స్మరణతో భక్తిమయ వాతావరణం నెలకొంది.

**ప్రత్యేక పుష్పాలంకరణలతో అభిషేకాలు, అర్చనలు**

గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఉదయం 5 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు రుద్రాభిషేకం, 9 గంటలకు గురుపౌర్ణమి వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మహా మధ్యాహ్న హారతి నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలంకరణల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో వేద పండితులు మంత్రోచ్ఛార ణలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు, బీఎస్ఎన్ కూరగాయల మండి నిర్వాహకుడు బండారు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తుడూ అన్నదానంలో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సేవాభావంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని భక్తులు అభినందించారు.

**భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు**

ఈ సందర్భంగా బండారు సుధాకర్ నాయుడు మాట్లాడుతూ గురుపౌర్ణమి రోజున అన్నదానం చేయడం సాయిబాబాకు అత్యంత ప్రీతికరమైన సేవ అని పేర్కొన్నారు. సమాజ సేవే నిజమైన దైవసేవ అనే భావనతో ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా తన సతీమణితో కలిసి గురుపౌర్ణమి సందర్భంగా అన్నదాన సేవను నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రాకపోకలు కొనసాగాయి. సాయిబాబా నామస్మరణ, భజనలు, హారతులతో ఆలయం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది. కార్యక్రమం విజయవంతానికి ఆలయ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, భక్తులు విశేషంగా సహకరించారు.





# గురుపౌర్ణమి సందర్భంగా ఇటిక్యాల సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ మండలం జూలై 29( రిపబ్లిక్ న్యూస్)**



గురుపౌర్ణమి సందర్భంగా జిల్లా జగిత్యాల్ రాయికల్ మండల ఇటిక్యాల గ్రామంలో సాయి బాబా ఆలయంలో సాయిబాబా ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ వెంట ఆలయ చైర్మెన్ హిమవంత రావు,కమిటి సభ్యులు, గ్రామ మండలనాయకులు, సర్పంచులు, మాజీసర్పంచులు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు తర్వాత రాయికల్ మండలశీ రామాజి పేట్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొలి చేట్టి నారాయణకి మోకాలు ఆపరేషన్ కాగా వారి స్వగృహాలో పరమర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వెంట సర్పంచ్ బెజ్జంకి మోహన్ సీనియర్ నాయకుడు కోల శ్రీనివాస్, మోహన్ రెడ్డి, సుర విజయ, వంశీకృష్ణ, తిరుపతి గౌడ్ సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాయికల్‌లో భారీ వర్షాల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ కట్కామ్ రవీందర్, కమిషనర్ మనోహర్ గౌడ్





**రాయికల్ మండలం జూలై,29( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల్ జిల్లా రాయికల్ పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు చైర్మన్ కట్కం రవీందర్, కమిషనర్ మనోహర్ గౌడ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే సమస్యాత్మక ప్రాంతాలను వారు స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా చెరువు కట్ట ప్రాంతం, రాయికల్ - రామాజీపేట రోడ్డు వంతెన , మరియు రాయికల్ - మహితపూర్ రోడ్డు వంతెన ప్రాంతాలను సందర్శించి, వర్షపు నీటి నిల్వలు మరియు ప్రవాహ పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, కమిషనర్ మనోహర్ గౌడ్, కౌన్సిలర్ రాకేష్ నాయక్, బీ ఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎలిగేటి అనిల్ కుమార్ మరియు ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారని కొక్కులా రంజిత్ తెలిపారు

# ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ మంత్రి బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి





**రాయికల్ మండలం జులై,29( రిపబ్లిక్ న్యూస్)**గురు పౌర్ణమిని పురస్కరించుకొని జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో నీ సాయి బాబా ఆలయంలో మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు బాగా కురవాలని రైతన్నలను కాపాడాలని ఆ దేవున్ని ప్రార్థించానని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు తాటిపర్తి సికి రెడ్డి మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్, కో ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ నాయకులు నాయిని శ్రీనివాస్, గోపి రాజిరెడ్డి,రాజేందర్ గౌడ్,ప్రతాప్ రెడ్డి,రొట్టె శ్రీను, అది రెడ్డి నారాయణ గౌడ్, విష్ణు,మురళి,హరీష్ రావు, రవి,కొక్కు శేఖర్,రఘునాత్,బుల్లెట్ రాజిరెడ్డి, కాటిపల్లి నారాయణ, సురకంటి రాజిరెడ్డి,దర్శకుమార్, హన్మండ్లు, రాజు,నల్ల గంగారెడ్డి,గంగాధర్, స్వామి, , ఎండీ రుక్కు, ప్రణయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ పోస్టులకు భారీ స్పందన

## కొల్చారం, పాపన్నపేట మండలాల్లో 186 దరఖాస్తులు..

## 102 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు హాజరు

**కొల్చారం జులై 29( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



మెదక్ పట్టణంలోని సిడిపిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించినట్లు మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ తెలిపారు. మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వెరిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 5 పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది వెరిఫికేషన్ కు హాజరైనట్లు సీడీపీఓ తెలిపారు. కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేసుకోగా, 38 మంది హాజరయ్యారు. పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది వెరిఫికేషన్ కు హాజరయ్యారు. భర్తీ జరుగుతున్న ఖాళీల్లో కొల్చారం మండలంలోని రంగంపేట2, కొంగోడ్ సెంటర్2, పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి సెంటర్2, అర్కెల సెంటర్2, లక్ష్మీనగర్ తండా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని సీడీపీఓ వెంకటరమణమ్మ వెల్లడించారు.

# రాయికల్ మండలంలో 100% ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి

**రాయికల్ మండలం జులై 29( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ 100% పూర్తయింది, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసిన సిబ్బందిని రాయికల్ తహసిల్దార్ నాగార్జున అభినందించారు, జగిత్యాల నియోజకవర్గం లోని రాయికల్ మండలం 100% ఎస్ఐఆర్ పూర్తిచేసిన తొలి మండలం గా నిలిచిందని పేర్కొన్నారు, తమ విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఉద్యోగులను అభినందించారు, అనంతరం స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు

# అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ పోటీలకు ఎంపికైన

## తేజ నాయక్, జగదీశ్వరిని అభినందించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నంద్యాల బ్యూరో, జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):** భూటాన్‌లో ఆగస్టు 24 నుంచి 27 వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికైన కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం గుడంబాయి తాండకు చెందిన తేజ నాయక్, నంద్యాల జిల్లా గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెందిన జగదీశ్వరిలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రతిభతో అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం జిల్లాలకు గర్వకారణమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువతను ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని, భూటాన్‌లో జరిగే పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. తేజ నాయక్ చిన్ననాటి నుంచే గోల్ షాట్ బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుతూ అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. అదేవిధంగా జగదీశ్వరి కూడా జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారత జట్టులో స్థానం సంపాదించడం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమన్నారు. ఇద్దరు క్రీడాకారులు నిరుపేద కుటుంబాలకు చెందినవారని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, స్పాన్సర్లు ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమాజం నుంచి లభించే ప్రోత్సాహం మరింత మంది గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# డా. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద రోగులకు పూర్తిస్థాయిలో ఉచిత వైద్య సేవలు అందించాలి

## ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అర్హులైన రోగులకు ఎలాంటి రుసుము వసూలు చేయకుండా అన్ని వైద్య సేవలను పూర్తిస్థాయిలో ఉచితంగా అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి సంబంధించి జిల్లా డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ (డీడీసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డియంహెచ్ఓ డా. వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డా. ఓ. లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా భారీ మొత్తంలో నిధులు వెచ్చిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పథకం కింద చికిత్స పొందే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని ఆసుపత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో చేరిన ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి, రోగులకు అవసరమైన అన్ని వైద్య సేవలను నిబంధనల ప్రకారం పూర్తిగా ఉచితంగా అందించాలని ఆదేశించారు. రోగుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా చికిత్స అందించడం ప్రతి ఎంప్యానెల్డ్ ఆసుపత్రి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. పథకం నిబంధనలు ఉల్లంఘించి పేదల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే సంబంధిత ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద కన్సల్టేషన్, అవసరమైన వైద్య పరీక్షలు, అత్యవసర వైద్య సేవలు తదితర అన్ని సేవలను రోగులకు పూర్తిగా ఉచితంగా అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు.

# బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

## పెద్దకొట్టాలలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం



**నంద్యాల, జూలై 29, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామ సచివాలయంలో వరల్డ్ విజన్ డైరెక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో వరల్డ్ విజన్ డైరెక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో ప్రతి చిన్నారి హక్కులను పరిరక్షించడం, సమాజానికి శాపంగా మారిన బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం మరియు బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు అత్యంత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం డీసీపీయూ అవుట్‌రీచ్ వర్కర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ, గ్రామంలో పిల్లలపై ఎలాంటి వేధింపులు జరిగినా, బాల కార్మికులు లేదా బాల్య వివాహాల వంటి ఘటనలు దృష్టికి వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసి పిల్లలకు తక్షణ రక్షణ కల్పించవచ్చని తెలిపారు. ప్రతి చిన్నారి భయం లేని సురక్షితమైన వాతావరణంలో పెరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు సమిష్టిగా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, సీపీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నంద్యాల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## : అవుకు వైఎస్సార్సీపీ నాయకుడు మధు దుర్మరణం

**-ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఉదయానంద ఆసుపత్రికి తరలింపు**

**- బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి**



మృతి చెందిన వ్యక్తి మధు (43) (ఫైల్)

**నంద్యాల/అవుకు జూలై 29 రిపబ్లిక్ న్యూస్** నంద్యాల జిల్లా అయ్యలూరు మెట్ట గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అవుకు పట్టణానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు మధు అక్కడిక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఉదయానంద ఆసుపత్రికి తరలించగా, మధు భౌతికకాయాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నంద్యాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కాటసాని ఓబుల్ రెడ్డి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి మాజీ ఉప సర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్ర రెడ్డి వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం మధు భౌతికకాయాన్ని దర్శించి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# నాణ్యమైన నివాస విద్యతో బాలికల సాధికారతకు కృషి చేయాలి

**బాలికల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలి**

**కేజీబీవీల్లో నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన భోజనం, భద్రత, పరిశుభ్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




**నంద్యాల బ్యూరో, జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):** కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బాలికలకు నాణ్యమైన నివాస విద్యను అందించి, వారిని అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు ప్రతి ఉపాధ్యాయుడు, అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో "ఏం పవరింగ్ గర్ల్స్ త్రో క్వాలిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్"అంశంపై జిల్లా విద్యాశాఖాధికారి, కేజీబీవీ ఇన్‌చార్జి జనార్దన్ రెడ్డి, కేజీబీవీ సీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ, వెనుకబడిన, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన బాలికలు, చదువు మధ్యలో మానేసిన విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విద్యార్థినికి సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆప్యాయతతో కూడిన నివాస వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

బాలికలను ప్రేమ, ఆప్యాయతలతో ఆదరించడంతో పాటు వారి తల్లిదండ్రులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. దీనివల్ల విద్యాసంస్థలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం, సానుకూల అభిప్రాయం పెరుగుతుందన్నారు. హాస్టల్‌లో విద్యార్థినులు ఎదుర్కొనే ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించేలా భరోసా కల్పించాలని ఆదేశించారు. కేజీబీవీ సూపర్వైజర్లు, ప్రిన్సిపాళ్లు విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు సమయానికి పరిశుభ్రమైన, పోషకాహారం కలిగిన భోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోడిగుడ్లు, చిక్కీలు తదితర ఆహార పదార్థాలను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా చేయాలని, వంటకు ఉపయోగించే పదార్థాలను పరిశుభ్రంగా నిల్వ ఉంచాలని సూచించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి కేజీబీవీలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు వంటి మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి కేజీబీవీలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, అనుమతి లేని వ్యక్తులను హాస్టళ్లలోకి ప్రవేశించనివ్వకూడదని ఆదేశించారు. విద్యార్థినుల సంరక్షణ బాధ్యతలు నిర్వహించే సిబ్బంది ఫొటోలతో కూడిన గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ప్రతి తరగతికి ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, విద్యార్థినుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లను నమోదు చేసి వారితో నిరంతర సమన్వయం కొనసాగించాలని తెలిపారు. విద్యార్థినుల విద్యా ప్రగతి, హాజరు, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉన్నత విద్యాభ్యాసం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన బాలికలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ద్వారా వారి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. జిల్లాలో టీనేజ్ గర్భధారణలు అధికంగా ఉన్న నేపథ్యంలో బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో బోధన కొనసాగించాలని, జిల్లాకు మరిన్ని "షైనింగ్ స్టార్" అవార్డులు వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కేజీబీవీ సూపర్వైజర్లు, ప్రిన్సిపాళ్లు విద్యార్థినుల సంక్షేమం పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, నిర్లక్ష్యం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష అధికారులు, విద్యాశాఖ అధికారులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యా లయాలు స్పెషల్ ఆఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**యువతను మత్తు వ్యసనాల నుంచి కాపాడేందుకు క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టండి -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల బ్యూరో, జూలై 29 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ సునీల్ షొరాన్‌తో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై కలెక్టర్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల నియంత్రణపై క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను విశ్లేషించి తగిన పరిష్కార చర్యలు చేపట్టాలని పోలీసు, ఎక్సైజ్, పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు అందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే మాదకద్రవ్యాల నియంత్రణలో ఆశించిన ఫలితాలు సాధించవచ్చన్నారు. యువతలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు, ఈగల్ బృందాలు, పోలీసు సిబ్బంది ద్వారా నిరంతర ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నందికొట్కూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల మెగా పేరెంట్-టీచర్ సమావేశానికి శికారిపేటకు చెందిన పలువురు విద్యార్థినులు గైర్హాజరు కావడాన్ని జిల్లా కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. వారి గైర్హాజరుకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రతి ఇంటిని సందర్శించి విద్యార్థుల విద్యా పరిస్థితులపై నివేదిక సమర్పించాలని విద్యాశాఖ అధికారులను, అక్రమ మద్యం తదితర నిషేధిత కార్యకలాపాలపై వివరాలు సేకరించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. గత నాలుగేళ్లలో 260 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 374 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. డ్రగ్ టెస్టింగ్ కిట్లు, ప్రత్యేక తనిఖీలు, కంబింగ్ ఆపరేషన్లు, పాఠశాలల పరిసరాల్లో నిఘా, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామని, బస్సు స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైళ్లలో స్నిఫర్ డాగ్స్ సహాయంతో విస్తృతంగా తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ 1972కు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఎక్సైజ్ అధికారులు నాటుసారా, అక్రమ మద్యం రవాణాపై జీరో టాలరెన్స్ విధానంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలతో పాటు డీ-అడిక్షన్, పునరావాస చర్యలను కూడా చేపడుతున్నట్లు విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, ఎస్‌డీపీఓలు, ఎక్సైజ్, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా పోలీసులకు ప్రత్యేక మెడిటేషన్ శిక్షణ

**ఒత్తిడిని అధిగమించి సమర్థవంతమైన విధి నిర్వహణకు ధ్యానం ఎంతో అవసరం**



**నంద్యాల క్రైం, జూలై 29, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో నంద్యాల జిల్లా పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, సహకారంతో, రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, ఆధ్వర్యంలో ప్రత్యేక మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రిటైర్డ్ డీజీపీ శ్రీ ఆదిత్య ఆర్య మాట్లాడుతూ పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులు, ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డ్ డ్యూటీలు, వీఐపీ భద్రత, నేరాల నియంత్రణ, ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తారని తెలిపారు. ఇలాంటి నిరంతర విధుల కారణంగా పోలీసులు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించి ప్రశాంతమైన మనస్సుతో విధులు నిర్వహించేందుకు ధ్యానం ఒక ఉత్తమ సాధనమని ఆయన వివరించారు. ప్రతిరోజూ కొద్దిసేపు ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మెరుగుపడుతుందని, కోప నియంత్రణ, భావోద్వేగ సమతుల్యత పెంపొందుతాయని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ధ్యాన విధానాలను ప్రత్యక్షంగా నేర్చుకోవడం జరిగిందని, వాటిని దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ధ్యాన శిక్షణను ఆసక్తిగా అభ్యసించి, ఇటువంటి కార్యక్రమాలు పోలీసు సిబ్బంది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, విధి నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఖాదర్ భాష, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, జిల్లా పోలీసు అధికారులు, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది, శిక్షకులు, ఇతరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com